క్లుప్తంగా

చురుగ్గా రోడ్డు పనులు


ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు

గొలుగొండ: కృష్ణదేవిపేట–నర్సీపట్నం ప్రధాన మార్గంలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో చురుగ్గా రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు పనుల కోసం ఎమ్మెల్యే గణేష్ కృషితో రూ. 6 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 22న ప్రారంభం నాటి నుంచి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు రెండు నెలల్లో పూర్తి చేయడం కోసం అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు చేపడుతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులకు దీర్ఘ కాల రవాణా కష్టాలు తొలగనున్నాయి.

తెలుగు పద్యాలపై విద్యార్థులకు తర్ఫీదు


విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెలవారి కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు తెలుగు పద్యాల విశిష్టత గురించి అవగాహన కలిపించారు. ఉపాధ్యాయుడు బి.ఎస్.ప్రసాద్ విద్యార్థులకు పద్యాలు చెప్పి, వారితో చెప్పించారు. విద్యార్థులకు ప్రతి ఆదివారం ఏదో ఒక అంశంపై అవగాహన కలిప్తున్నామని గ్రంథాలయ అధికారి దమయంతి తెలిపారు.

పాచిలవానిపాలెంలో చురుగ్గా అభివృద్ధి పనులు



సీసీరోడ్డు నిర్మాణ పనులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో చురుగ్గా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇక్కడ అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. వీటితోపాటు ఉపాధి హామీ పథకం నిధులు సీసీరోడ్ల నిర్మాణానికి అదనంగా కేటాయించారు. ఇందులో భాగంగా మెయిన్‌రోడ్డు నుంచి రామాలయం, మంచినీటి పథకం ట్యాంకు నుంచి చెరువుగట్టు వరకు సీసీ రోడ్లతోపాటు అవసరయిన చోట డ్రైనేజీల నిర్మాణాలను ప్రస్తుతం రూ.18 లక్షలతో చేపడుతున్నారు. ఈ పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో జరిగేటట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా పసలమారమ్మ పండగ

దేవరాపల్లి: పసలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయం ఎదురుగా అమ్మవారికి ప్రతిరూపంగా కొలిచే వేప చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఈ సీజన్‌లో పాడి పంటలు సమృద్ధిగా పండాలని పలసమ్మ తల్లికి పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలోనే గ్రామంలోని రైతులంతా తమ పశువులను ఒకే చోటకు తీసుకువచ్చి పూజలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరుశురామ అవతారంలో జగన్నాథుడు


పరుశురామ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

మాడుగుల: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా పరుశురామ అవతారంలో స్వామి వారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పండా నూకరాజు సారథ్యంలో పూజలు చేశారు. ఈ నెల 29న ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వరి వంగడాలు సిద్ధం

- 2 రోజుల్లో పంపిణీ చేయనున్న అధికారులు
- మాడుగుల మండలానికి 1,320 క్వింటాళ్ల లక్ష్యం
- మొదటి విడతగా చేరిన 620 క్వింటాళ్లు


సత్యవరం ఆర్బీకేకు వచ్చిన వరి విత్తనాలు


ఆర్‌బీకేలో మొలకశాతం పరిశీలిస్తున్న దృశ్యం

మాడుగుల: ఖరీఫ్ వరి సాగుకు విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని అందించేందుకు సమాయత్తం అవుతుంది. మండలానికి 1,320 క్వింటాళ్ల కావల్సి ఉండగా, ఇప్పటికే మొదటి విడతగా చేరిన 620 క్వింటాళ్లు చేరుకున్నాయి.

80 శాతం మొలక వచ్చాక...

రైతులకు విశిష్ట సేవలందించేందుకు మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో ఈ ఏడాది 1,320 క్వింటాళ్ల వరి విత్తనాల కోసం ప్రతిపాదన పంపారు. ఇప్పటికే మొదటి విడతగా ఆయా కేంద్రాలకు 620 క్వింటాళ్లు చేరుకున్నాయి. వాటి నాణ్యతను పరిశీలించడానికి వ్యవసాయాధికారులు మొలక శాతం కట్టారు. 80 శాతం మొలక వచ్చిన తర్వాత మరో నాలుగు రోజుల్లో రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నారు.

వరి వంగడాలు ఇవే..

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుకు అనుకూలమైన వంగడాలపై ప్రభుత్వం, అధికారులు అవగాహన కలిపించారు. దీనికి అనుకుగుణంగా వ్యవసాయ శాఖ అధిక దిగుబడులు వచ్చే వంగడాలు సోనామసూరి, సాంబామసూరి, స్వర్ణమసూరి, ఆర్‌జీఎల్(2537), ఇంద్ర, అమర్, మారుసాంబ రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం చేసింది.

వెన్నుదన్నుగా ఆర్బీకేలు..

రైతులకు రైతు భరోసా కేంద్రాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. విత్తనాలు వేసే ముందు దశ నుంచి పంట పండే వరకు సంబంధిత అధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అదను దాటక ముందే రైతులకు గ్రామాల్లోనే రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు అందిస్తున్నారు. పంట పండిన తర్వాత కొనుగోలు చేస్తున్నారు. ఈ విధంగా ఎన్నో రకాల సేవలందిస్తున్నారు.

ఆనాటి విత్తన కష్టాలు తప్పాయి



గత పాలనలో వరి విత్తనాలు తీసుకోవాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆరోజు విత్తనాలు ఇవ్వకపోతే మర్నాడు వెళ్లేవాళ్లం. రాను పోను రూ. 500 రవాణా ఖర్చయ్యేది. ఇప్పుడు పైసా ఖర్చు లేదు. లంచం అనే మాట లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఆర్బీకేల ద్వారా విత్తనాలు స్వగ్రామంలోనే అందుతున్నాయి. సాగు పెట్టుబడులకు రైతు భరోసా సాయం ఇవ్వడంతో అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. ఆర్బీకేల పుణ్యమా అని దళారుల బెడద తప్పింది.

– శనివాడ వెంకటరమణ, రైతు, సత్యవరం

అందుబాటులో విత్తనాలు



ఈ ప్రాంతానికి అనుకూలమైన అధిక దిగుబడులు వచ్చే 7 రకాల వరి వంగడాలు ఎంపిక చేశాం. మొలక శాతం పూర్తయిన వెంటనే రైతులకు రాయితీపై విత్తనాలు అందజేస్తాం. ఇప్పటికే సంగం విత్తనాలు ఆర్బీకేలకు చేరాయి. మిగిలినవి నాలుగు రోజుల్లో వస్తాయి. రైతులకు ఆర్బీకేల ద్వారా సూచనలు సలహాలు అందిస్తున్నాం.

– ఎం.వాసుదేవరావు, ఏవో, మాడుగుల

ప్రతి గడపనూ సర్వే చేయాలి

మాకవరపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపనూ సర్వే చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ సూచించారు. మాకవరపాలెం, పైడిపాల గ్రామ సచివాలయాల్లో ఆదివారం వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమ విజయవంతానికి అంతా కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి 11 రకాల సేవలపై సర్వే చేయాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు ఉచిత సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ నేతలు బొడ్డు గోవిందరావు, రుత్తల శ్రీను పాల్గొన్నారు.


మాకవరపాలెం సచివాలయంలో మాట్లాడుతున్న రమణ

నేడు వంటర్లపాలెంలో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: మండలంలోని వంటర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ అల్లాడ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరై ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, పీఏసీఎస్ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

రేపు ఆర్బీకే భవనం ప్రారంభం

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఈ నెల 27న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆదివారం తెలిపారు. రూ.21.80 లక్షలతో ఈ కేంద్రాన్ని నిర్మించామన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

3న గురుపౌర్ణమి వేడుకలు

కె.కోటపాడు: స్థానిక షిర్డీసాయిబాబా మందిరం వద్ద వచ్చే నెల 3న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి కాగడ హారతి, పంచామృతాభిషేకాలు, ఫలరస, సుగంధ పరిమళాలతో అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పూడిక తీయక నిలుస్తున్న వర్షపునీరు


బండారు వీధిలో వర్షపునీటిలో గృహాలు

రోలుగుంట: స్థానిక వీధి కాలువల్లో పూడిక తీయక చిన్నపాటి వర్షానికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల ముంగిట వర్షపు నీరు చేరి నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తోంది. అయిదు వేల జనాభా కలిగిన రోలుగుంటలోని వీధి కాలువల్లో పూడిక పేరుకుపోయింది. వర్షపు నీరు పోయే మార్గం లేక ప్రధాన రోడ్లపైనే పారుతూ లోతట్టు ప్రాంతాలైన బండారు, పెదలక్షయ, అల్లువారి వీధిల్లోని ఇళ్లలోకి చేరుతోంది. గృహోపకరణాలతో పాటు ధాన్యం, దుస్తులు తడిచి ముద్దవుతున్నాయి. అధిక రోజుల నీరు నిల్వలతో దోమలు వ్యాపించి నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని బండారు లక్ష్మి, బోడాపత్రుని రాజు, కురచా రాము తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడికతోపాటు హనుమాన్ గుడి వద్ద బండారు వీధి ఆనుకున్న మదుముల్లో కూరుకుపోయిన మట్టిని పూర్తిస్థాయిలో తొలగిస్తే ఈ సమస్య మెరుగుపడుతుందని బాధిత వీధి వాసులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనస చెట్టు నిండా కాయలే..


తమనారంపాలెంలో ఒక రైతు ఇంటి వద్ద చెట్టు నిండా పనస కాయలు

రోలుగుంట: రొంగలపాలెం శివారు తమనారంపాలెంలో ఒక రైతు ఇంటి వద్ద పనస చెట్టు విరగ్గాసింది. సాధారణంగా చెట్లకు కొమ్మలు వ్యాపించి పంట కాపు చూస్తాం. ఇక్కడ టేకు చెట్టు మాదిరిగా ఏపుగా పెరిగి 70 కాయలు పైబడి కాపునిచ్చింది. కాసిన కాపు మేరకు రూ.5 వేల పైబడి ఆదాయం వస్తుందని చెట్టు యజమాని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు ఆదివారం కావడంతో అనకాపల్లితో పాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసుకుని అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగతా వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపివేశారు.

శ్రీ సఖి సేవా సమితి ఉదారత


విద్యార్థులతో సేవా సమితి సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ విద్యార్థులకు రూ. లక్షాయాభై వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, స్టేషనరీ, బియ్యం, కూరగాయలను విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన శ్రీ సఖీ సేవా సమితి సభ్యులు ఆదివారం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు పీఎస్‌టీ పట్నాయక్ సమక్షంలో శ్రీ సఖీ సేవా సమితి వ్యవస్థాపకురాలు బిందు రాణి చేతుల మీదుగా అందజేశారు. బిందు రాణి మాట్లాడుతూ అచ్యుతాపురం ఆశ్రమానికి తాము ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని, పట్నాయక్ వంటి ఉదారత కలిగిన వ్యక్తుల ఆధ్వర్యంలో ఆశ్రమ విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం

సబ్బవరం:మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో ఇటీవల పిడుగుపాటుతో మేకలు మృతిచెందిన బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. గత సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గ్రామంలోని సబ్బి రమణకు చెందిన 18 మేకలు మృతి చెందాయి. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, స్పెషల్ పీపీ కరణం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అలల ఉధృతి

ఎస్.రాయవరం: అల్ప పీడనం ప్రభావంతో మండలంలో మేఘావృతం అయ్యి ఆదివారం చల్లని వాతావరణం నెలకొంది. ఉదయం చిరు కురిసిన తరువాత ఆకాశం మబ్బులు కమ్ముకుని చల్లగాలులు వీచాయి. ఇక రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. తీరంలో కూడా మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. కెరటాల తీవ్రత మాత్రం పెద్దవిగా రావడంతో మత్స్యకారులు ఒడ్డున ఉన్న తెప్పలు మరింత సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.

తేలికపాటి వర్షం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం 6 గంటల సమయంలో తేలిక పాటి చినుకులు పడ్డాయి. రోజంతా ఆకాశం మేఘావృతమైంది. అయితే ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. దీంతో రైతులు నిరాశ చెందారు.

ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ


ఆర్బీకేలో వరి విత్తనాలను రైతులకు అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: తొలకరి వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరి సేద్యానికి రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి విత్తనాల పంపిణీని చేపట్టారు. నారుమడులను రైతులు ఇది వరకే సిద్ధం చేసుకోవడంతోపాటు వారికి అవసరమయ్యే వరి విత్తనాల కోసం ఆర్బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు ఇప్పటికే డిమాండ్‌లు పెట్టడంతో ఆ మేరకు విత్తనాలు సంసిద్ధంగా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం ఆర్బీకేలో సర్పంచ్ శిరిసోళ్ల విజయ కమల గంగాభవాని, ఎంపీటీసీ సంద్రాన వీరయ్య, మాజీ సర్పంచ్ ఎస్.ఆదిగణపతి నాయుడు వరి విత్తనాల పంపిణీని చేపట్టారు. ఆర్జీఎల్ 2537 రకం విత్తనం 60 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం నాలుగు క్వింటాళ్లు, సాంబామసూరి, బీపీటీ 3291 రకం విత్తనాలు 900 కేజీలు పంపిణీ చేశారు. విత్తనాలతోపాటు విత్తనశుద్ధి చేయడానికి సూడోమోనస్ అందజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు కోలా ఫణీంద్ర రైతులకు వరినారు మడుల సేద్యంలో మెలకువలను సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా తాము డిమాండ్ పెట్టుకున్న మేరకు రైతులు వరి విత్తనాలను తీసుకుని నారుమడుల సేద్యానికి సిద్ధం చేసుకున్నారు. ఇంకా అవసరం ఉన్న రైతులు సోమవారం సాయంత్రం లోగా తమకు కావలసిన వరి విత్తనాల కోసం నగదును చెల్లించి నమోదు చేసుకోవాలని ఆయా గ్రామాల ఆర్బీకేల్లో వీఏఏలు కోరారు. రుతుపవన వర్షాలు మరలా నిలిచిపోవడంతో నారుమడులు సిద్ధం చేసినప్పటికీ విత్తనాలు వెదజల్లడంలో కొందరు వేచి చూచే ధోరణిలో ఉన్నారు. సాగునీటి సౌకర్యం ఉన్నచోట నారుమడుల్లో విత్తనాలు వేయడం పూర్తి చేశారు.

రూ.1.30 లక్షల బీమా చెక్కు అందజేత


బాధిత మహిళకు బీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వావిలపాడు జంక్షన్ వద్ద ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కరక సత్యనారాయణ భార్య వీరలక్ష్మికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రమాద బీమా చెక్కును ఆదివారం అందజేశారు. దేవరాపల్లి పీఏసీఎస్‌లోని పంట రుణం పొందిన సభ్య రైతు సత్యనారాయణ గతేడాది ఆగస్టులో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పీఏసీఎస్‌లో (కోఆపరేటివ్ బ్యాంక్) ప్రమాద బీమా, సాధారణ బీమా కలిపి మొత్తంగా రూ. 1.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో రైవాడ జలాశయం అతిథి గృహం వద్ద అందజేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి గోపి, డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వాలేటి నాగరాజు, సబ్బవరపు మాలిబాబు, కొల్లి ఈశ్వరరావు, కొరుపోలు శ్రీను, సొసైటీ సీఈవో ఎన్. కనకారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల కొరత లేకుండా చర్యలు

నాతవరం వ్యవసాయాధికారి శైలజ


సిబ్బందికి సూచనలు చేస్తున్న మండల వ్యవసాయాధికారి శైలజ

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనాలు సమస్య లేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బందే చూసుకోవాలని వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆదివారం ఆమె సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి నుంచి వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోనే మండలంలో అధిక విస్తీర్ణంలో ఖరీఫ్ వరి పంట సాగు చేస్తారన్నారు. తాండవ రిజర్వాయరు నీటి సదుపాయం ఇతర ఏ మండలాలకు లేదన్నారు. మండలానికి కావలసిన విత్తనాలకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఆర్‌జీఎల్ 2537 రకం 775 క్వింటాళ్లు, ఎం.టి.యు–1064 రకం 1100 క్వింటాళ్లు, ఎం.టి,యు–1051 రకం 150 క్వింటాళ్లు, బి.పి.టి 5204 రకం 20 క్వింటాళ్ల విత్తనాలు మండలానికి వస్తున్నాయన్నారు. ప్రస్తుతం సగానికిపైగా విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాల కోసం నమోదు చేసుకున్న రైతులకు సోమవారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఆ సమయంలో ఆర్బీకే సిబ్బంది రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

కె.కోటపాడు: మండలంలో రైవాడ కెనాల్ మార్గంపై వంతెనలకు రక్షణగోడలు పలు చోట్ల ఛిద్రమయ్యాయి. కెనాల్ మార్గంలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా జీవీఎంసీ అధికారులు 25 ఏళ్ల క్రితం రక్షణ వంతెనలు నిర్మించారు. ప్రస్తుతం వీటిని వాహనాలు ఢీకొనడంతోపాటు ధ్వంసమయ్యాయి. దీంతో దాలివలస, కె.కె.అగ్రహారం, గవరపాలెం, డి.అగ్రహారం గ్రామాల కెనాల్ మార్గంలో వంతెనలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గవరపాలెం ఎంజీహెచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం శంకరంలోని బొజ్జన్నకొండ వద్ద గవరపాలెం ఎంజీహెచ్(చిన్న) హైస్కూల్ 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలుసుకుని రోజంతా సరదాగా గడిపారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలు, తరగతి గదుల్లో సరదాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో కొండ పరిసరాలలో సందడి చేశారు. ఆర్థికంగా వెనకబడిన తమ తోటి పూర్వ విద్యార్థులకు కష్టకాలంలో భరోసా కల్పించేలా కమిటీ ఏర్పాటుకు తీర్మానం చేశారు.

బ్రాండిక్స్‌లో 395 మందికి వైద్య పరీక్షలు


కళ్లద్దాలు అమర్చుతున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండెక్స్ అపెరల్ పార్కులో ఆదివారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 395 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 303 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.79 మందికి మందులు అందజేశారు. 29 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి శిబిరంలో భాగంగా విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన వసతులు కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 109 కంటి వైద్య శిబిరాలను నిర్వహించామని తెలిపారు. సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలనేది తమ లక్ష్యం అని అన్నారు.

యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత

అనకాపల్లి టౌన్: యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తుందని ఎన్టీఆర్ వైద్యాలయ వైద్యాధికారి జి.కృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు కోలపర్తి భవనంలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన యోగా పోటీలు సాయంత్రం ముగిశాయి. విజేతలకు వైద్యులు కృష్ణ, అపర్ణ, భవన నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు కోలపర్తి జయబాబు బహుమతులు ప్రదానం చేశారు.